సాక్షి
తిరుపతి
శనివారం। 12। ఆగస్టు। 2023



మాజీ సైనికులకు ఇంటి స్థలాలు

జిల్లాలోని మాజీ సైనికులకు త్వరలో ఇంటి స్థలాలు పంపిణీ చేయనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. - 10లో



'పండుగ' సంబరం

వెంకటగిరి పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. - 10లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	35	24
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	26

న్యూస్‌రీల్

14న ఐటీఐలో అప్రెంటీస్‌షిప్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కిల్ ఇండియా–మేకిన్ ఇండియాలో భాగంగా ఈ నెల 14వ తేదీన ఉదయం 10గంటలకు తిరుచానూరు రోడ్డు పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ వి.శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ వివిధ కంపెనీల ప్రతినిధులు మేళాకు హాజరై అప్రెంటీస్‌షిప్‌పై అభ్యర్థులకు అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆయా కంపెనీల్లో అంప్రెటీస్‌షిప్ కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఐటీ ఉత్తీర్ణులైనవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 94416 47174, 96764 86678 నంబర్లలో అప్రెంటీస్‌షిప్ అడ్వైజర్ గంగాధరాన్ని సంప్రదించాలని సూచించారు.

14న జాబ్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణం వద్ద ఉప ఉపాధి కార్యాలయంలో ఈ నెల 14వ తేదీన జాబ్ మేళా నిర్వహించనున్నారు. శుక్రవారం ఈ మేరకు ఉప ఉపాధి అధికారి ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ శ్రీరామ్ లైఫ్ ఇన్స్‌రూ ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు మేళాకు హాజరై ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడివంచారు. శ్రీరామ్ లైఫ్ ఇన్స్‌రూ బ్రాంచ్ మేనేజర్/మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు ఏదేని డిగ్రీ పూర్తి చేసిన పురుషులు, అలాగే ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలో ప్రొబేషనరీ ట్రైనీ ఆఫీసర్/జూనియర్, రిలేషన్‌షిప్ ఆఫీసర్/ఇంటర్‌షిప్ ఉద్యోగాలకు డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతీయువకులు పాల్గొనవచ్చని వివరించారు. 18 నుంచి 30 ఏళ్లలోపు అభ్యర్థులు ఉద్యోగ మేళాకు అర్హులని, వివరాలకు 98498 24057, 82175 80447 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అలాగే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

పాఠశాలలకు క్రీడా ప్రతిభ అవార్డులు


తిరుపతి ఎడ్యుకేషన్ : ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దిన పాఠశాలలను ప్రోత్సహించేందుకు జిల్లా స్థాయి క్రీడా ప్రతిభ అవార్డు–2023ను అందజేయనున్నట్లు డీఈఓ వి.శేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఈ నెల 29వ తేదీన అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఏపీ స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్న విద్యార్థుల సర్టిఫికెట్లను ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ధ్రువీకరించి ఈ నెల 16వ తేదీలోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

12 మందికి ఉద్యోగాలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ ఆఫీసులో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేరకు 12 మందికి ఉద్యోగాలు లభించినట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 56మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరైనట్లు వివరించారు.

22న వాక్ ఇన్ సెలక్షన్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన వాక్ ఇన్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సంస్థ సీఈఓ శేషశైలేంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్ హాస్పిటల్‌లో అనస్తీషియా టెక్నీషియన్స్, బర్డ్ హాస్పిటల్‌లో అడియాలజిస్ట్, రేడియోగ్రాఫర్, స్పీచ్ థెరపిస్ట్, జూనియర్ ఆడిటర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు 22వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటకు దరఖాస్తు, ధ్రువీకరణ పత్రాలతో శ్రీలక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు ఎస్ఎల్ఎస్ఎంపీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడవచ్చని సూచించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



▶▶ తిరుపతి ఎమ్మార్‌పల్లెకు చెందిన కోమల అనే మహిళకు 36ఏళ్లు. ఇంతవరకు సంతానం కలగలేదు. టీవీలో ప్రకటనలు చూసి రెండేళ్ల క్రితం చెన్నైలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిని ఆశ్రయించారు. రూ.30 వేలు చెల్లించి భార్యాభర్తలు అన్ని రకాల పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ వారి ఫలితాలను పరిశీలించి గర్భధారణ కలగాలంటే ఫీజుగా రూ.5 లక్షలు అడిగారు. ఆ దంపతులు ఖర్చుకు వెనకాడకుండా అడిగినంతా ముట్టజెప్పారు. అయినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో నిరాశగా ఇంటి ముఖం పట్టారు.

▶▶ చిత్తూరు మండలానికి చెందిన సుమనప్రియ (28)కు 9ఏళ్ల క్రితం వివాహమైంది. కానీ సంతానం కలగలేదు. తీరా ఆస్పత్రిలో పరీక్షిస్తే.. పీసీఓడీ ఉందని డాక్టర్లు నిర్ధారించారు. అయితే ఆమె ఓ నాటు వైద్యుడిని ఆశ్రయించారు. ఆరు నెలల పాటు ఆకు మందు తీసుకున్నారు. ఇందుకోసం ప్రతి నెల రూ. 2వేలు చెల్లించారు. అయినప్పటికీ గర్భం రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▶▶ చిత్తూరు నగరం తోటపాళ్యానికి చెందిన దంపతులకు పిల్లలు లేరు. వివాహమై రెండేళ్లు గడుస్తున్నా గర్భం దాల్చకపోవడంతో జిల్లా ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకున్నారు. ఆమెకు పీసీఓడీ సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో 8నెలల పాటు ఆమెను పర్యవేక్షణలో ఉంచారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ మందులు వాడేలా జాగ్రత్తలు తీసుకున్నారు. 10వ నెలలో ఆమె గర్భం దాల్చింది. ప్రస్తుతం పండంటి బిడ్డకు జన్మనిచ్చింది.

అమ్మకు అవరోధం

ఉమ్మడి జిల్లా సమాచారం

టీచింగ్ ఆస్పత్రులు 02	సీహెచ్‌సీలు 15	ప్రైవేట్ హాస్పిటళ్లు సుమారు 3వేలు
జిల్లా ఆస్పత్రి 01	పీహెచ్‌సీలు 108	
ఏరియా వైద్యశాలలు 07		

మాతృత్వం.. మహిళలకు దేవుడిచ్చిన వరం. మరోజీవికి ప్రాణం పోసే అపూర్వమైన అవకాశం. అయితే హార్మోన్ల అసమతుల్యత కారణంగా పలువురు స్త్రీలు ఈ అపురూప భాగ్యానికి దూరమవుతున్నారు. పీసీఓడీ (నీటి బుడగలు) సమస్యలతో నెలసరి గాడి తప్పి గర్భధారణకు నోచుకోలేకపోతున్నారు. అమ్మా అనే పిలుపు కోసం అలమటిస్తున్నారు. పల్లెసీమల్లో కంటే పట్టణప్రాంతాల్లోనే బాధితులు పెరుగుతున్నారు. ఈ క్రమంలో పిల్లలపై ప్రేమను చంపుకోలేక నిత్యం వందల మంది ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. రూ.లక్షల్లో ఫీజు ముట్టజెప్పి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. నెలల తరబడి చికిత్సలు పొందుతున్నారు. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. మందులను క్రమం తప్పకుండా వాడడంతోపాటు ఆరోగ్య జాగ్రత్తలను పాటిస్తే ప్రయోజనం ఉంటుందని వివరిస్తున్నారు. ఇందుకోసం ప్రభుత్వాస్పత్రుల్లోనే వైద్యం పొందే వెసులుబాటు ఉందని వెల్లడిస్తున్నారు.

- మహిళల్లో అధికమవుతున్న పీసీఓడీ సమస్య
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెద్దసంఖ్యలో నమోదవుతున్న కేసులు
- పల్లెల కంటే పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న బాధితులు
- కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సకు రూ.లక్షల్లో ఫీజులు
- ఆరోగ్య జాగ్రత్తలే శ్రీరామరక్ష అంటున్న వైద్యులు



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో మహిళలకు వైద్య పరీక్షలు (ఫైల్)

సాక్షి, తిరుపతి డెస్క్ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు మహిళలు పీసీఓడీ (పాలిసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్) అంటే 'నీటి బుడగల' సమస్యతో బాధపడుతున్నారు. నిత్యం దాదాపు 120 నుంచి 150 మంది వరకు పీసీఓడీ చికిత్స కోసం ఆస్పత్రులకు వస్తున్నారు. ముఖ్యంగా అర్బన్ ప్రాంతాల్లోని స్త్రీలే ఎక్కువగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

పీసీఓడీ ఎందుకొస్తుందంటే...

ప్రతి స్త్రీలోనూ రుతు క్రమం వచ్చినప్పుడు అండాశయంలో అండం పరిపక్వత చెంది విడుదల అవుతుంది. నెలసరి తర్వాత 11–18 రోజుల మధ్యకాలంలో అండం విడుదల ప్రక్రియ జరుగుతుంది. ఇందుకు ఈస్ట్రోజన్ హార్మోన్ అవసరమవుతుంది. ఈ హార్మోన్ లోపం తలెత్తినప్పుడు క్రమంగా పీసీఓడీకి దారితీస్తుంది. ఈ సమస్యతో బాధపడే వారిలో విడుదలయ్యే అండం పూర్తిగా ఎదగక, అది అండాశయంలో నీటి బుడగ రూపంలో ఉండిపోతుంది. అలాగే జీవనశైలిలో వచ్చిన మార్పులు, నిద్రలేమి, సమయానికి ఆహారం తీసుకోకపోవడం, ఎత్తుకు తగ్గ బరువు ఉండకపోవడం, పని ఒత్తిడి, బయట తిండికి అలవాటు పడడం వంటి కారణాలతో కూడా పీసీఓడీ బారినపడుతుంటారని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

ఎలాంటి ఆహారం తీసుకోవాలంటే...

జీవనశైలిలోని మార్పులు కూడా పీసీఓడీకి కారణమవుతున్నాయి. ముఖ్యంగా ఫాస్ట్‌ఫుడ్‌లు అనారోగ్య సమస్యలను తెచ్చిపెడుతున్నాయి. ప్రోటీన్లు, విటమిన్లు, ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. విటమిన్ –బి లోపం రాకుండా చేపలు, గుడ్డు, ఆకుకూరలు, క్రమం తప్పకుండా తీసుకోవాలి. ఇలాచేస్తే నెలసరి క్రమంగా వచ్చి సమస్య నుంచి బయటపడుతారు. దీనికి తగట్టు వ్యాయామం అవసరం.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గర్భస్థ సమస్యల ఓపీ వివరాలు


నెల	ఓపీ సంఖ్య
ఫిబ్రవరి	5,589
మార్చి	6,286
ఏప్రిల్	7,219
మే	7,114
జూన్	8,082
జూలై	8,547

ఫీజులు గుంజేస్తున్నారు

గతంలో పిల్లలు పుట్టకుంటే వ్రతాలు, నోములు నోచేవాళ్లు. దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ప్రస్తుతం కార్పొరేట్ మాయాజాలంలో పలువురు దంపతులు కొట్టుకుపోతున్నారు. మాతృత్వం పొందేందుకు రూ.లక్షల్లో ఫీజులు ముట్టజెబుతున్నారు. పీసీఓడీ సమస్యతో బాధపడేవారిని కార్పొరేట్ ఆస్పత్రుల వారు సైతం యథేచ్ఛగా దోచుకుంటున్నారు. దంపతుల బలహీనతను అడ్డుపెట్టుకుని రూ.3 నుంచి రూ.10లక్షల వరకు ఫీజులు గుంజేస్తున్నారు. చిత్తూరు, తిరుపతి వంటి నగరాల్లో సైతం రూ.లక్షలు వసూలు చేసేస్తున్నారు. మరికొందరు నాటువైద్యం అంటూ అనారోగ్య సమస్యలను తెచ్చుకుంటున్నారు. పీసీఓడీ నివారణకు ప్రభుత్వాస్పత్రిలోనే పూర్తి స్థాయిలో సేవలు ఉన్నాయని వైద్యులు గుర్తు చేస్తున్నారు.

లక్షణాలు

- నెలసరి సక్రమంగా రాదు
- ఎక్కువగా బ్లీడింగ్, రుతుక్రమం సమయంలో కడుపు నొప్పి ఉంటుంది
- అధిక బరువు, అకారణంగా జుట్టు రాలడం
- నెలసరి రాకపోవడంతో ముఖం, కాళ్ల మీద అవాంఛిత రోమాలు పుట్టుకొస్తాయి. బరువు పెరిగిపోతారు.
- శరీరంలో ఇన్సులిన్ నిరోధకత కూడా పెరిగిపోతుంది.



పరీక్షలు..

పీసీఓడీని నిర్ధారించడానికి గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలి. వారి సూచనల మేరకు హార్మోన్ల స్థాయిని లెక్కించడానికి రక్త పరీక్షలు చేస్తారు. అండాశయం, గర్భాశయం రూపాన్ని తెలుసుకోవడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేసి నిర్ధారిస్తారు.

వ్యాధులు ఇలా..

- ఎండోమెట్రియల్ క్యాన్సర్
- కొలెస్ట్రాల్ పెరుగుదల
- అధిక రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు
- గర్భస్రావాలు, సంతాన లేమి
- మధుమేహం
- మానసిక జబ్బులు
- అసాధారణ గర్భాశయ రక్తస్రావం
- క్రమ రహిత రుతుక్రమం

బెంగపడొద్దు.. దత్తత ఉందిగా..

పిల్లలు లేరనే బాధతో ఎక్కువగా మహిళలు కుమిలిపోతుంటారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఇరుగుపొరుగు వారు ఏమనుకుంటారో అని దిగులు చెందుతుంటారు. అలాంటి వారికి దత్తత చక్కటి వరమంటున్నారు అధికారులు. ఐసీడీఎస్ నిర్వహించే శిశు విహార్‌ల ద్వారా దత్తత కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

వైద్యులను సంప్రదించాలి



మహిళలను ఇటీవల కాలంలో ఎక్కువగా ఇబ్బంది పెడుతున్న సమస్య పీసీఓడీ. దీని బారిన పడితే నెలసరి తప్పడం, అవాంఛిత రోమాలు రావడం ఉంటుంది. గర్భధారణ కూడా ఇబ్బందికరంగా మారుతుంది. మారుతున్న వాతావరణ పరిస్థితులు, వంశపారంపర్యంగా వస్తున్న సమస్యలతో ఇలాంటి కేసులు పెరుగుతున్నాయి. గర్భధారణకు చికిత్స పేరుతో మోసపోకండి. నాటు మందుల జోలికి వెళ్లొద్దు. సంబంధిత డాక్టర్లను సంప్రదించడం ఉత్తమం. ఇందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా మెరుగైన చికిత్స అందిస్తున్నారు.

– డాక్టర్ ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

నిర్లక్ష్యం చేస్తే సమస్యలు



పీసీఓడీ అనేది 14–45 ఏళ్ల లోపు ఉన్న మహిళల్లో అధికంగా వస్తోంది. ఈ మధ్య కాలంలో పీసీఓడీ కేసులు పెరిగాయి. చాలా మందికి పని ఒత్తిడి, టీవీలు, మొబైల్ ఫోన్లు గంటల తరబడి చూడడం. పిజ్జాలు, బర్గర్లు తినడం. బరువు పెరగడం కారణంగా పీసీఓడీ సమస్య తలెత్తుతోంది. లక్షణాలు బట్టి లేదా..వివాహమై ఏడాది గడిచినా గర్భధారణ జరగకుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నిర్లక్ష్యం వహిస్తే సమస్యలు తప్పవు.

– డాక్టర్ ఉషశ్రీ, గైనకాలజిస్ట్, చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రి

అవయవదానంపై అవగాహన

తిరుపతి కల్చరల్ : అవయవదానంపై సమాజంలో అందరికీ అవగాహన పెరగాలని టీటీడీ పాలకమండలి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన అవయవదానంపై అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్విమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సును జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. భూమన మాట్లాడుతూ అవయవదానంపై అపోహలు తొలగించేందుకు యువత కృషి చేయాలని సూచించారు. పంచభూతాలతో ఆవరింపబడిన ఆత్మ ఒక్కటే శాశ్వతమని, అవయవాలు అశాశ్వతమని తెలిపారు. అవయవాలను ట్రాన్స్‌ప్లాంట్ చేసే అత్యుత్తమ వైద్య వ్యవస్థ మనకు ఉందని, అయితే దాతలు ముందుకు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ తదితర అవయవాలను తయారు చేసుకోలేమని వెల్లడించారు. అయితే మరణానికి దగ్గరగా ఉన్నవారు అవయవదానం చేస్తే మరొకరిని బతికించే అవకాశముంటుందని వివరించారు. టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో వైద్య సౌకర్యాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. క్యాన్సర్ చికిత్స కోసం రూ.250 కోట్లతో బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీని స్విమ్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శ్రీపద్మావతి చిన్న పిల్లల హృదయాలయంలో చిన్న పిల్లల గుండె ఆపరేషన్లు దిగ్విజయంగా జరుగుతున్నాయని వెల్లడించారు. స్విమ్స్‌లో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తున్నారని వివరించారు. లైసెన్స్ రాగానే త్వరలో లివర్, ప్యాంక్రియాస్ మార్పిడి శస్త్ర చికిత్సలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. టీటీడీ జేఈఓ, స్విమ్స్ డైరెక్టర్ సదా భార్గవి మాట్లాడుతూ అవయవదాన దినోత్సవం సందర్భంగా ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అవయవదానం ఆవశ్యకతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లు కావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు స్విమ్స్ నుంచి మహతి కళాక్షేత్రం వరకు టీటీడీ పాఠశాలు, కళాశాలల విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, పద్మావతి చిన్న పిల్లల హృదయాలయం డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీనాథ్‌రెడ్డి, బర్డ్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రాచపల్లి రెడ్డెప్పరెడ్డి, స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణబిట్ల, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, శ్రీపద్మావతి వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శరణ్ బి సింగ్, కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.



వేదికపై టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవి తదితరులు



హాజరైన విద్యార్థులు, అధికారులు

చిన్నపిల్లల ఆస్పత్రి పనులు వేగవంతం

తిరుపతి తుడా : చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయనున్నట్టు టీటీడీ జేఈఓ సదా భార్గవి తెలిపారు. శుక్రవారం ఆస్పత్రి నిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. నవంబర్ నాటికి ఆరు ఫ్లోర్లను పూర్తి చేయాలని ఆదేశించారు.



సూచనలిస్తున్న జేఈఓ సదాభార్గవి

ఆర్థిక స్వావలంబనకే 'సున్నావడ్డీ'

- వైఎస్సార్ సున్నావడ్డీ కింద నాలుగో విడత సాయం
- 36,973 సంఘాలకు లబ్ధి
- ఆయా ఖాతాల్లో రూ.54.81 కోట్లు జమ

తిరుపతి అర్బన్ : అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనకే ప్రభుత్వం వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం, జనుపల్లె నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సున్నావడ్డీ నాలుగో విడత సాయం విడుదల చేశారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సాధికారత కోసం సున్నా వడ్డీ కింద నగదు జమ చేసినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని 27,524 పొదుపు సంఘాలకు చెందిన 3,30,093 మందికి రూ.37.74 కోట్లు, పట్టణ ప్రాంతాల్లోని 9,449 పొదుపు సంఘాల సభ్యులు 1,05,677 మందికి రూ.17.07కోట్లు మొత్తం 36,973 స్వయం సహాయక సంఘాలకు వారి ఖాతాల్లోకి రూ. 54.81 కోట్లు జమ చేశామని వివరించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, ఏపీడీ ప్రభావతి, లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ బాలాజీ

జగనన్నకు కృతజ్ఞతలు



నేను తినుబండారాల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా. మూడు విడతల్లో అందించిన వైఎస్సార్ సున్నావడ్డీ పథకం నాకు బాగా ఉపయోగపడింది. నాలుగో విడత కూడా అందిస్తున్నారు. అలాగే అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాల ద్వారా కూడా లబ్ధి పొందా.అన్ని విధాలుగా ప్రభుత్వం మమ్మల్ని ఆదుకున్నందుకు జగనన్నకు కృతజ్ఞతలు.

– నిర్మల, తిమ్మినాయుడుపాళెం

రుణపడి ఉంటాం



వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం కింద మూడు విడతల్లో లబ్ధి పొందా. నాలుగో విడత కూడా తీసుకుంటున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నేను పండ్ల వ్యాపారం చేసుకుంటున్నా. సున్నా వడ్డీ మాత్రమే కాకుండా అమ్మఒడి, విద్యా కానుక, విద్యా దీవెన, జగనన్న కాలనీలో ఇంటి పట్టా పొందాను. ఈ ప్రభుత్వంలో అనేక పథకాల ద్వారా ప్రయోజనం పొందాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– వెంకటలక్ష్మి, ఆటోనగర్

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


107 పరుగులు చేసిన నెల్లూరు క్రీడా కారుడు రోహిత్.


సెంచరీ సాధించిన కర్నూలు ప్లేయర్ హృదయ్


105 పరుగులు చేసిన నెల్లూరు ఆటగాడు తరుణ్

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అండర్–16 క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శుక్రవారం కడప–కర్నూలు, అనంతపురం–నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరిగాయి. గ్రౌండ్–1లో కడప– కర్నూలు జట్ల మధ్య జరిగిన పోటీల్లో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొత్తం 93 ఓవర్లలో 246 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు రెండో ఇన్నింగ్స్ ప్రారంభించి ఆట ముగిసే సమయానికి 13 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 79 పరుగులు చేసింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 107 పరుగుల ఆధిక్యంతో ఉంది. శనివారం మ్యాచ్ కొనసాగనుంది. గ్రౌండ్–2లో అనంతపురం– నెల్లూరు జట్లమధ్య జరుగుతున్న మ్యాచ్‌లో నెల్లూరు జట్టు రెండో రోజు ఆట కొనసాగించి మొత్తం 178 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 534 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించి ఆట ముగిసే సమయానికి 12 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 33 పరుగులు చేసింది. అనంపురం జట్టు నెల్లూరు జట్టు కంటే 506 పరుగులు వెనుకంజలో ఉంది.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని పెద్దకనపర్తి వద్ద ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం సెబ్ అధికారులు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. పిల్లమేడు చెందిన గురవయ్య ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు.

మాజీ సైనికులకు త్వరలో ఇంటి స్థలాలు

- సైనికుల సంక్షేమానికి కృషి
- ఘనంగా అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ
- పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి.
- జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ


అమరజవాన్ స్థూపం ఆవిష్కరణలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులు

చిత్తూరు కలెక్టరేట్ : దేశ సేవలో ప్రాణాలు విడిచిన అమరువీరులు ఎంతో మంది మన జిల్లాలో ఉన్నారని, వారి సేవలు శ్లాఘనీయమని విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సైనిక సంక్షేమ శాఖ, మాజీ సైనిక సంక్షేమ శాఖ సభ్యులు ఇచ్చిన విన్నపం మేరకు త్వరలో సైనికులకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్‌కు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తిరుత్తణి బస్టాండు వద్ద అమర జవాన్ స్థూపం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జరిగిన సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ మాజీ సైనికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. చిత్తూరులో అమరవీరుల సేవలకు గుర్తుగా స్మారక స్థూపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా స్థూపం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

సైనికులు, మాజీ సైనికుల సంక్షేమంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఇన్‌చార్జి మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. సైనికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రోత్సాహకాలను ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో మృతి చెందిన 23 మంది అమర జవాన్‌లను సేవలను గుర్తుచేసుకుంటూ స్థూపం వద్ద ఏటా నాలుగు రోజులు సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ఏడు వేల మంది సైనికులు ఆర్మీలో పనిచేస్తున్నారని చెప్పారు. కలెక్టర్ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ మాజీ సైనికుల ఇళ్ల స్థలాల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. త్వరలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఎస్పీ రిశాంత్ రెడ్డి మాట్లాడుతూ సైనికులు, మాజీ సైనికుల సమస్యలను పోలీసు శాఖ తరుపున పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. సైనిక సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలోచిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు సైనికులు విధి నిర్వహణలో అసువులు బాశారని తెలిపారు. వారికి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో స్పందించి ఒక్కో కుటుంబానికి రూ. 50 లక్షలు మంజూరు చేసిందన్నారు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, నగర మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, కార్పొరేటర్ షర్మిల, సైనిక సంక్షేమ శాఖాధికారి విజయశంకర్‌రెడ్డి, మాజీ సైనిక సంక్షేమ సంఘం సభ్యులు పళని, సిద్ధయ్య, వరదరాజులు, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,700
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,451
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.72,200
రిటైల్ వెండి గ్రాము	రూ.74.20

వేదిక్ వర్సిటీలో అత్యాధునిక తాళపత్ర స్కానర్

తిరుపతి సిటీ: శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఫ్రాన్స్ నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక తాళపత్ర స్కానర్‌ను శుక్రవారం టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, జేఈఓ సదాభార్గవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ శ్రీవేకటేశ్వర తాళపత్ర పరిశోధన సంస్థ దేశంలోనే అతిగొప్ప సంస్థగా ఎదగాలన్నారు. దానికి టీటీడీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చెప్పారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణీ సదాశివమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీ రాధేశ్యామ్, డీన్లు గోలి సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ ఫణియాజులు, తాళపత్ర విభాగాధిపతి విజయలక్ష్మి, పీఆర్వో బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

కేంద్ర ఆరోగ్య పథకాల్లో అవకతవకలు వాస్తవమా?


పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : దేశంలో అమలవుతున్న కేంద్ర ఆరోగ్య పథకాల్లో ఆర్థిక అవకతవకలు వాస్తవమేనా అని ఎంపీ గురుమూర్తి ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీ పార్లమెంట్ సమావేశాల్లో ఆయన కేంద్రప్రభుత్వంపై ప్రశ్నల పరంపర సంధించారు. పథకాల్లో ఆర్థిక అక్రమాలు గుర్తించి నిరోధించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వినియోగించాలని భావిస్తున్నారా అని అడిగారు. ఆస్పత్రుల్లో పథకాల అమలును తనిఖీ చేసి దోషులపై తీసుకున్న చర్యలను వివరించాలని కోరారు. దీనిపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మాన్సుక్ మాండవీయ సమాధానమిచ్చారు. నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు ఇటీవల న్యూఢిల్లీలోని ఎయిమ్స్ కేంద్రంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై అన్వేషిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తున్న నేషనల్ హెల్త్ అథారిటీ, ప్రధాన మంత్రి – జన్ ఆరోగ్య యోజన, నేషనల్ యాంటి ఫ్రాడ్ యూనిట్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

18న చెంగాళమ్మకు పుష్పయాగం


విశేషాలంకరణలో అమ్మవారు

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో నిజ శ్రావణమాసం తొలి శుక్రవారం ఈనెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ చెన్నైకు చెందిన నంబూరు మోహన్ రావు–సులోచనమ్మ, నంబూరు మనోజ్‌సాయి–లత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించనున్నట్లు వెల్లడించారు.

చిలుకపై మయూరవాహనుడు


ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రహ్మణ్యస్వామివారు ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిలుక వాహనంపై విహరించారు. తొలుత ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దేవదేవేరులను చిలుక వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

తిరుపతి క్రైం : తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాలను చోరీ చేస్తున్న నలుగురు బాలురను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు క్రైమ్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. నిందితుల నుంచి రు.2లక్షల విలువైన రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మైనర్ బాలురు నలుగురు ముఠా ఏర్పడి ఒంటరిగా వెళుతున్న వారిని బెదిరించి దోచుకునేవారని వివరించారు. వీరు చెడు వ్యసనాలకు అలవాటు పడి, చదువు మానేసి జులాయిగా తిరిగేవారని చెప్పారు. నిందితులను జువైనల్ హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

'పండుగ' సంబరం


పోలేరమ్మతల్లి ఆలయం వద్ద నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరిరూరల్ : వెంకటగిరి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌జీఆర్ భవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అడిగిన వెంటనే వెంకటగిరి ప్రజల ఆకాంక్షలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో వెంకటగిరి రాజాలతో చర్చించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా గతంలో కంటే మెండుగా పోలేరమ్మ జాతర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం త్రిభువని సెంటర్‌లోని దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలోనే పోలేరమ్మతల్లి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వీట్స్ పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ దొంతు శారద, పార్టీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, వైస్ చైర్మన్ ఎస్.బాలయ్య, ఆర్టీసీ రీజనల్ కమిటీ మాజీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి, విబ్ పూజారి లక్ష్మి, మహిళావిభాగం అధ్యక్షులు ధనియాల రాధ, పార్టీ జిల్లా సంయుక్త సహాయ కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, న్యాయవాది ఎల్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దివ్య దక్షిణ జ్యోతిర్లింగ యాత్ర

- ఆగస్టు 23, సెప్టెంబర్ 5న ప్రారంభం
- రెండు రైళ్ల ఏర్పాటు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కిషోర్ సత్య ఆనందం

తిరుపతి అర్బన్: భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ నేతృత్వంలో భారత్ గౌరవ టూరిస్ట్ రైలును ఏర్పాటు చేశారని ఆ సంస్థ జాయింట్ జనరల్ మేనేజర్ కిషోర్ సత్య ఆనందం తెలిపారు. శుక్రవారం తిరుపతి రైల్వే స్టేషన్ వీఐపీ చాంబర్‌లో మీడియా సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు జ్యోతిర్లింగాలను సందర్శించడానికి అనుకూలంగా «దివ్య దక్షిణ్ యాత్ర» పేరుతో టూరిస్ట్ రైలును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ , తమిళనాడు, కేరళ ప్రాంతాల్లోనే యాత్రికుల కోసం దక్షిణ దివ్య క్షేత్రాలను, జ్యోతిర్లింగాలను సందర్శించడానికి ఐఆర్‌సిటిసి ఈ అవకాశాన్ని కల్పించిందని చెప్పారు. సౌకర్యవంతమైన రైలు ప్రయాణంతోపాటు అన్ని వసతులు కలిప్తున్నట్లు తెలిపారు. చెప్పారు. తిరువణ్ణామలై (అరుణాచలం), మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చి, తంజావూరులోని ముఖ్యమైన పుణ్య క్షేత్రాలు, పలు పర్యాటక ప్రదేశాల సందర్శనకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తెలంగాణలోని సికింద్రాబాద్, ఖాజీపేట, వరంగల్, ఖమ్మంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు ఈ రైలును ఎక్కవచ్చన్నారు. ఆగస్టు 23 నుంచి 9 రోజులు, సెప్టెంబర్ 5 నుంచి 9 రోజులు రెండు రైళ్లు ఏర్పాటు చేశామని, ఎవరికి ఏది అనుకూలమో దానిని ఎంచుకోవచ్చన్నారు. ఎకానమీ కేటగిరీకి (స్లీపర్ క్లాస్) రూ.14300, స్టాండర్డ్ కేటగిరి(3 ఏసీ) రూ 21,900, కంఫర్ట్ కేటగిరి (2ఏసీ) రూ 28500 జీఎస్టీతో కలిపి నిర్ణయించామని వెల్లడించారు. టికెట్ బుకింగ్ వివరాల కోసం ఫోన్ నెంబర్ 8287932313, 8287932315 సంప్రదించాలని సూచించారు. తొలుత ఆయన ఈ రైళ సమాచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఏరియా మేనేజర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

వరిని ఆశిస్తున్న మొవ్వ తొలిచే పురుగు

తిరుపతి అర్బన్: జిల్లాలో వరిపంట వెన్నుకు వస్తున్న దశలో మొవ్వ పురుగు/కాండం తొలిచే పురుగు ఆశిస్తోంది. ఈ పురుగు ఆశించడం వల్ల అక్కడక్కడా తెల్ల వెన్నులు కనిపిస్తున్నాయి. దీని నివారణకు రైతులు వివిధ రకాలైన మందులను పిచికారీ చేస్తున్నారు. అయితే వాస్తవానికి, ఈ పురుగు నిర్మూలనకు పైరు లేతగా ఉన్నప్పుడే పిచికారీ చేయాలి. వెన్నుదశలో పిచికారీ చేస్తే ఫలితం ఉండదు. ఈ పురుగు నివారణ చర్యలు చిరుపొట్ట దశకు ముందే తీసుకోవాలి. వెన్ను దశలో మందులను వరిపిలకల మొదళ్లలో కొట్టడం సాధ్యం కాదు మందులు పంట మీద కొట్టినా, కాండము లోపల ఉన్న పురుగుకు ఏమీ కాదు. రైతులు దీనిని దృష్టిలో ఉంచుకుని పంటను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య తెలిపారు.

రూ.1.25 లక్షల విలువ చేసే గంజాయి పట్టివేత


సూళ్లూరుపేట: నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే ముందస్తు సమాచారంతో శుక్రవారం సాయంత్రం దాడులు చేసి రూ.1.25 లక్షల విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి, సెబ్ డీఎస్‌ఈఓ రాజేంద్ర ఆదేశాల మేరకు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, సెబ్ అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించగా వరదయ్యపాళెం మండలం, తొండూరు సొసైటీ గ్రామానికి చెందిన కొమ్మలపూడి రవికుమార్, తడ మండలం, కారూరుకు చెందిన శ్రీహరికోట ప్రకాష్, చెన్నై నగరంలోని ఎన్నూరుకు చెందిన భూమినాథం ముత్తు గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నారు. గంజాయిని స్వా. దీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సెబ్ సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ బీ.శశికుమార్, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎం.శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌ఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

గూడూరురూరల్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం ఉదయం గంజాయి విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. నిందితుడి నుంచి 4 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన ఆటో డ్రైవర్ పరశురాం కిషోర్‌కుమార్ అనే యువకుడు అనకాపల్లెకు చెందిన రాజా అనే వ్యక్తి వద్ద రూ.20వేలకు 4 కేజీల గంజాయిని కొనుగోలు చేసి దాన్ని చెన్నైలో విక్రయించేందుకు తీసుకెళుతున్నాడని వివరించారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి రాజేంద్ర ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎక్కడైనా గంజాయి రవాణా, విక్రయాలను గుర్తిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారం అందించాలని సూచించారు. దాడుల్లో ఎస్‌ఈబీ ఎస్‌ఐ ఎ.శేషమ్మ, హెడ్‌కానిస్టేబుల్ ఎం.కిరణ్‌సింగ్, సిబ్బంది పి.రమేష్, వీఎస్ ప్రసాద్, ఎం.కృష్ణ, ఎస్‌కే బాషా, బి.దయాకర్, టి.నారాయణయ్య పాల్గొన్నారు.